‘యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడి’

ముదిగొండ, నవంబర్ 27: సరైన యాజమాన్య పద్ధతులతో అధిక దిగుబడులు పొందవచ్చునని జిల్లా ఉద్యాన, పట్టు పరిశ్రమ అధికారి మధుసూదన్ అన్నారు. మండలంలోని మేడేపల్లి, గోకినేపల్లి, కట్టకూరు గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన.. ఆ గ్రామాల్లో రైతులు సాగుచేస్తున్న మామిడి, జామ, పామాయిల్ పంటలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాస్త్రవేత్తలు, అనుభవజ్ఞుల సూచనలు పాటించడం ద్వారా నాణ్యమైన దిగుబడులు రాబట్టవచ్చునని అన్నారు. మధిర ఉద్యాన అధికారి విష్ణు తదితరుల పాల్గొన్నారు.

పామాయిల్ తోటను పరిశీలిస్తున్న అధికారులు

మిర్చి పంటలను పరిశీలించిన ఏడీఏ

ఎర్రుపాలెం, నవంబర్ 27: మండలంలోని అయ్యవారిగూడెంలో రైతులు సాగు చేస్తున్న మిర్చి పంటలను మధిర ఏడీఏ స్వర్ణ విజయచంద్ర బుధవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ఈ సందర్భంగా రైతులతో చర్చించి పలు సూచనలు చేశారు. మిర్చి పంటలో అధిక ఎరువులను వినియోగించడం వల్ల కలిగే నష్టాల గురించి వివరించారు. ఎరువులను దఫదఫాలుగా వేయడం వల్ల కలిగే ఉపయోగాలను విశదీకరించారు. మాజీ సర్పంచ్ గోసు రామారావు, బొగ్గుల బుచ్చిరెడ్డి, కాలసాని శ్రీనివాసరావు, ఏఈవో బీ.శ్రీకాంత్, రైతులు పాల్గొన్నారు.

మిర్చి పంటలను పరిశీలిస్తున్న మధిర ఏడీఏ విజయచంద్ర

పాడి పశువుల పాల ఉత్పత్తి పోటీలు

ఎర్రుపాలెం, నవంబర్ 27: జిల్లా పశుగణాభివృద్ధి సంస్థ, పశుసంవర్ధక శాఖ, ఇందిరా క్రాంతి పథం సంయుక్తంగా మండలంలోని శఖునవీడు గ్రామంలో పాడి పశువుల పాల ఉత్పత్తి పోటీలను బుధవారం నిర్వహించారు. గర్భకోశ వ్యాధుల చికిత్స శిబిరం నిర్వహించి పరీక్షలు నిర్వహించి మందులు అందజేశారు. ఇందిరా క్రాంతి పథం నుంచి అసిస్టెంట్ ప్రాజెక్టు మేనేజర్ లక్ష్మణరావు, వెంకటేశ్వర్లు, సీసీ రమాదేవి హాజరై.. ఇందిరా మహిళా డెయిరీ, పవువుల పెంపకం వంటి అంశాలపై రైతులకు అవగాహన కల్పించారు. జిల్లా అధికారులు ఎం.వెంకటేశ్వరరావు, టీ.లక్ష్మణచారి, గోపాలమిత్రలు ఆర్.కృష్ణ, ఆంజనేయులు, ఎస్కే రామ్‌రహీం, కే.వెంకటేశ్వర్లు, వై.వీరయ్య, సీహెచ్ వారిధిరెడ్డి, శ్రీనివాసరెడ్డి పాల్గొన్నారు.

రైతులకు అవగాహన కల్పిస్తున్న అధికారులు

‘రాజ్యాంగ విశిష్టతపై అవగాహన పెంచుకోవాలి’

మధిర, నవంబర్ 27: రాజ్యాంగ విశిష్టతపై విద్యార్థులు అవగాహన పెంచుకోవాలి మధిర జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయురాలు నండూరి విజయశ్రీ సూచించారు. భారత రాజ్యాంగ 75వ వార్షికోత్సవం సందర్భంగా సదరు పాఠశాలలో బుధవారం నిర్వహించిన సదస్సుల్లో ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా ప్రార్థనా సమయంలో విద్యార్థులతో ప్రతిజ్ఞ చేయించారు. ఉపాధ్యాయులు నాగూర్‌వలీ, జ్యోతి, శ్రీనివాసరావు, జీవన ప్రశాంతి, విజయలక్ష్మి, నరసింహారావు, శ్రీను, భట్టాచార్య, రాజశేఖర్‌రావు, శంకర్‌రావు, సమత పాల్గొన్నారు.

అవగాహన కల్పిస్తున్న ప్రధానోపాధ్యాయురాలు

జ్యోతిబాపూలే పాఠశాలలో ప్రత్యేకాధికారి తనిఖీ

బోనకల్లు, నవంబర్ 27: బోనకల్లులోని జ్యోతిబా పూలే గురుకుల పాఠశాలను మండల ప్రత్యేకాధికారి విజయభాస్కర్ రెడ్డి తనిఖీ చేశారు. ఈ సందర్భంగా రికార్డులు పరిశీలించారు. విద్యార్థుల భోజనాన్ని కూడా పరిశీలించి ‘రుచికరంగా ఉందా?’ అని అడిగి తెలుసుకున్నారు. భోజనం తయారీ విషయంలో జాగ్రత్తలు పాటించాలని, విద్యార్థులకు నాణ్యమైన ఆహారాన్ని అందించాలని ఆదేశించారు. తహసీల్దార్ అనిశెట్టి పున్నంచందర్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న విజయభాస్కర్‌రెడ్డి

చిరు వ్యాపారికి లయన్స్ క్లబ్ ఆర్థికసాయం

తిరుమలాయపాలెం, నవంబర్ 27: తిరుమలాయపాలెం బస్టాండ్ సెంటర్లో కొబ్బరి బోండాలు విక్రయించుకుంటూ జీవించే చిరు వ్యాపారి సాల్మన్‌రాజుకు ఖమ్మం లయన్స్ క్లబ్ బాధ్యుడు జెర్సీ ఉపేందర్ చేయూతనందించారు. రూ.2,500 విలువైన పెద్ద నీడ గొడుగును బుధవారం సదరు చిరు వ్యాపారికి అందజేశారు. హైస్కూల్ ఉపాధ్యాయులు విజయకుమారి, లయన్స్ క్లబ్ సభ్యులు శుభన కృష్ణ, కళ రఘుబాబు, హెడ్ కానిస్టేబుల్ హరీశ్ పాల్గొన్నారు.

రైతులకు అండగా బీఆర్‌ఎస్ : మాజీ ఎమ్మెల్యే సండ్ర

సత్తుపల్లి, నవంబర్ 27: రైతులకు ఎల్లప్పుడు బీఆర్‌ఎస్ పార్టీ అండగా ఉంటుందని మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య అన్నారు. తల్లాడ సీసీఐ పత్తి కొనుగోలు కేంద్రంలో మూడు రోజులుగా పత్తి కొనుగోలు చేయకుండా సాంకేతిక కారణాల నెపంతో రైతులను ఇబ్బందులు పెడుతున్న విషయం తెలుసుకొని బుధవారం సీసీఐ కేంద్రాన్ని సందర్శించారు. పత్తి రైతుల ఇబ్బందులను ప్రత్యక్షంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం జిల్లా జాయింట్ కలెక్టర్, వైరా మార్కెట్ కమిటీ సెక్రటరీలతో ఫోన్‌లో మాట్లాడి తిరిగి పత్తి కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రైతుల సమస్యలను తెలుసుకుంటూ వారి సమస్యలను పరిష్కరించేందుకు బీఆర్‌ఎస్ అండగా ఉంటుందని రైతులకు తెలిపారు. రెడ్డెం వీరమోహన్‌రెడ్డి, దొడ్డా శ్రీనివాసరావు, దుగ్గిదేవర వెంకట్‌లాల్, మువ్వా మురళీ, వజ్రాల రామిరెడ్డి, వనిగండ్ల వెంకటేశ్వరరావు, రుద్రాక్షల బ్రహ్మం, కటిక నరసింహారావు, దగ్గుల శ్రీనివాసరెడ్డి, దగ్గుల రాజశేఖర్‌రెడ్డి, రేగళ్ల సత్యం ఉన్నారు.

మాట్లాడుతున్న మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య

దీక్షాదివాస్ సభను జయప్రదం చేయండి

పెనుబల్లి, నవంబర్ 27: ఈ నెల 29న ఖమ్మం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయంలో జరిగే దీక్షా దివస్‌ను జయప్రదం చేయాలని సత్తుపల్లి మాజీ ఎమ్మెల్యే సండ్ర వెంకటవీరయ్య కార్యకర్తలకు పిలుపునిచ్చారు. బుధవారం కల్లూరు మండల నాయకులు, కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. బీఆర్‌ఎస్ అధినేత కేసీఆర్ నవంబర్ 29న దీక్ష చేసి పోరాడి తెలంగాణను సాధించారని గుర్తుచేశారు. కట్టా అజయ్‌కుమార్, లక్కినేని రఘు, జరుపుల లీలావతి, బోబోలు లక్ష్మణరావు, చావా వెంకటేశ్వరరావు, కొరకొప్పు ప్రసాద్, సీహెచ్ కిరణ్, రావుఫ్ తదితరులు పాల్గొన్నారు.

సమాజ సేవ శాశ్వతంగా నిలిచిపోతుంది

కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

రఘునాథపాలెం, నవంబర్ 27 : సమాజంలో నలుగురికి ఉపయోగపడేలా చేసే సేవలు శాశ్వతంగా నిలిచిపోతాయని కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్ అన్నారు. బుధవారం వీ వెంకటాయపాలెం గ్రామంలో జహీర్ అహ్మద్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో రూ.3.50 లక్షలతో ఏర్పాటు చేసిన బోర్‌వెల్, పైప్‌లైన్, ఆర్‌వో ప్లాంట్, కరెంటు మోటర్‌ను కలెక్టర్ ప్రారంభించారు. పాఠశాల అవసరాలను గుర్తించిన దాతలకు కృతజ్ఞతలు తెలిపారు. దాతలు కూరాకుల నాగభూషణం, కుతుంబాక మధును కలెక్టర్ సన్మానించారు.

నాగభూషణంను సన్మానిస్తున్న కలెక్టర్ ముజమ్మిల్ ఖాన్

ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న అదనపు కలెక్టర్ శ్రీనివాసరెడ్డి

ధాన్యం కొనుగోలు కేంద్రాల పరిశీలన

పెనుబల్లి, నవంబర్ 27: కల్లూరు మండలంలోని కొర్లగూడెం గ్రామంలో ఐకేపీ ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని, పేరువంచ, గోపవరం గ్రామాల్లో సొసైటీల ద్వారా ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాలను, తల్లాడలోని జిన్నింగ్‌మిల్లును అదనపు కలెక్టర్ పీ.శ్రీనివాస్‌రెడ్డి బుధవారం పరిశీలించారు. ఈ సందర్భంగా సంబంధిత కొనుగోలు కేంద్రాల అధికారులతో మాట్లాడుతూ.. రైతులకు ఇబ్బందులు పడకుండా ఎప్పటికప్పుడు కొనుగోళ్లు పూర్తి చేసి, చెల్లింపులు వెంటనే జరిగేలా చూడాలని ఆదేశించారు. ఆయన వెంట మార్కెటింగ్, వ్యవసాయ శాఖ అధికారులు ఉన్నారు.

రెజోనెన్స్ విద్యార్థికి బంగారు పతకం

ఖమ్మం ఎడ్యుకేషన్, నవంబర్ 27 : ఖమ్మం నగరంలోని రెజోనెన్స్ జూనియర్ కళాశాలకు చెందిన విద్యార్థి కొత్తపల్లి వినయ్‌కుమార్ రాష్ట్రస్థాయి నెట్‌బాల్ పోటీల్లో బంగారు పతకం సాధించినట్లు కళాశాల డైరెక్టర్లు రాజా వాసిరెడ్డి నాగేంద్రకుమార్, కొండా శ్రీధర్‌రావు బుధవారం తెలిపారు. మహబాద్‌లో జరిగిన స్టేట్‌మీట్‌లో సత్తాచాటి నేషనల్ లెవల్‌కి ఎంపికనట్లు పేర్కొన్నారు. విద్యార్థిని డైరెక్టర్లు, ప్రిన్సిపాల్ సతీష్, భాస్కర్‌రెడ్డి అభినందించారు.

విద్యార్థులను అభినందిస్తున్న డైరెకర్లు, ప్రిన్సిపాల్

‘కేజీబీవీ ఉపాధ్యాయులకు మినిమం బేసిక్ ఇవ్వాలి’

బోనకల్లు, నవంబర్ 27: కేజీబీవీ ఉపాధ్యాయులు, సమగ్ర శిక్షా ఉద్యోగులకు మినమం బేసిక్ ఇవ్వాలని కోరుతూ టీఎస్‌యూటీఎఫ్ నాయకులు డిమాండ్ చేశారు. ఆ సంఘం రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు బోనకల్లు కస్తూర్బా పాఠశాల ఎదుట మధ్యాహ్న భోజన సమయంలో బుధవారం నిరసన వ్యక్తం చేశారు. సమస్యలను తెలిపే ప్లకార్డులను ప్రదర్శించారు. ఈ సందర్భంగా సంఘం మండల ప్రధాన కార్యదర్శి గుగులోతు రామకృష్ణ మాట్లాడుతూ.. ప్రభుత్వం ఇచ్చిన హామీ మేరకు కేజీబీవీ ఉపాధ్యాయులకు, సమగ్ర శిక్ష ఉద్యోగులకు మినిమం బేసిక్ వర్తింపజేస్తూ వెంటనే ఉత్తర్వులు జారీ చేయాలని డిమాండ్ చేశారు. సంఘం నాయకులు సద్దా బాబు, పీ.గోపాలరావు, చిన్న రంగారావు తదితరులు పాల్గొన్నారు.

ఉద్యమకారులకు ఇచ్చిన హామీలు నెరవేర్చాలి

ఖమ్మం, నవంబర్ 27 : ఎన్నికలకు ముందు కాంగ్రెస్ పార్టీ తెలంగాణ ఉద్యమకారులకు ఇచ్చిన హామీలను వెంటనే నెరవేర్చాలని తెలంగాణ ఉద్యమకారుల ఫోరం రాష్ట్ర స్టీరింగ్ కమిటీ చైర్మన్ డాక్టర్ కేవీ కృష్ణారావు డిమాండ్ చేశారు. బుధవారం తెలంగాణ ఉద్యమకారుల ఫోరం స్టేట్ చైర్మన్ డాక్టర్ చీమ శ్రీనివాస్ నేతృత్వంలో పాదయాత్ర చేపట్టారు. ఈ సందర్భంగా కృష్ణారావు మాట్లాడుతూ కాంగ్రెస్ ప్రభుత్వం తన మేనిఫెస్టోలో పొందుపరిచిన ఏ ఒక్క హామీని ఇంతవరకు నెరవేర్చలేదన్నారు. కార్యక్రమంలో పసుపులేటి నాసారయ్య, రవీంద్రహన్,శ్రీనివాస్‌నాయక్, ఆశీర్వాదం, రమణ, వరలక్ష్మి, రాము, ఎల్లన్న తదితరులు పాల్గొన్నారు.

పాదయాత్రలో పాల్గొన్న ఉద్యమకారులు

బాల్య వివాహాలు లేని ఖమ్మాన్ని నిర్మిద్దాం..

జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖర్‌రావు

రఘునాథపాలెం, నవంబర్ 27 : బాల్య వివాహాలు అనేవి బాలల అభివృద్ధికి అడ్డుగోడలని, వాటిని సమూలంగా నిర్మూలించినప్పుడే బాలల భవిష్యత్తును చక్కగా నిర్మించుకోగలుగుతారని జిల్లా న్యాయ సేవాధికార సంస్థ కార్యదర్శి చంద్రశేఖరరావు పిలుపునిచ్చారు. యాక్షన్ ఫర్ ఇంటిగ్రేటెడ్ డెవలప్‌మెంట్ సంస్థ, జస్ట్ రైట్స్ ఫర్ చిల్డ్రన్స్ అలయన్స్ ఆధ్వర్యంలో మండల కేంద్రం రఘునాథపాలెం జ్యోతీబాపూలే బీసీ బాలికల పాఠశాలలో ఏర్పాటుచేసిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. చట్టసభల్లో బాల వివాహాల నిర్మూలన కోసం అవలంబించిన చట్టాలు బాలల కోసం ప్రభుత్వ పథకాలు న్యాయ వ్యవస్థ ద్వారా బాలలకు లభించే ఉచిత న్యాయ సహాయం బేటీ పడావో బేటీ బచావో వంటి పథకాలను సద్వినియోగం చేసుకొని బాలలు ఉన్నత చదువులు చదివి దేశానికి సమాజానికి సేవ చేయాలని చెప్పారు. ఏఐడీ సంస్థ డైరెక్టర్ పీఎస్‌ఎస్ హరిప్రసాద్‌రావు, ప్రిన్సిపాల్ అనిత నాగమణి, ఎయిడ్ సంస్థ బాధ్యులు మాధవి, రాందాస్, రవీందర్, రవిచంద్ర, భాస్కర్ పాల్గొన్నారు.

కరాటే పోటీల్లో న్యూలిటిల్ ఫ్లవర్ విద్యార్థుల ప్రతిభ

వైరాటౌన్, నవంబర్ 27: అంతర్జాతీయ స్థాయి కరాటే పోటీల్లో న్యూలిటిల్ ఫ్లవర్ పాఠశాలకు చెందిన విద్యార్థులు సత్తా చాటారు. గోవాలో జరిగిన ఎఫ్‌ఎస్‌కెఏ కరాటే వరల్డ్ కప్ పోటీల్లో పాఠశాలకు చెందిన 9వ తరగతి విద్యార్థి కె.శ్రీమన్నారాయణ 50 కేజీల కరాటే పోటీల్లో బంగారు పతాకాన్ని సాధించారు. 9వ తరగతికి చెందిన మరో విద్యార్థి రేవంత్ బంగారు పతకాన్ని కైవసం చేసుకున్నారు. ఏడో తరగతి విద్యార్థి భాను ప్రసాద్ 35 కేజీల కరాటే విభాగంలో వెండి పతకాన్ని సాధించాడు. విద్యార్థులను బుధవారం వైరా ఏసీపీ రెహమాన్ ప్రత్యేకంగా అభినందించారు. కరస్పాండెంట్ డాక్టర్ పోతినేని భూమేశ్వరరావు, డైరెక్టర్ కుర్రా సుమన్, ప్రిన్సిపాల్ షాజీమ్యాథ్యూ, ఏవో సామినేని నర్సింహారావు, కరాటే మాస్టర్ మహబూబ్ అభినందించారు.

ప్రతిభ చాటిన విద్యార్థులు

‘1న మాలల సింహగర్జన సభ’

ముదిగొండ, నవంబర్ 27: డిసెంబర్ 1న జరిగే మాలల సింహగర్జన సభను విజయవంతం చేయాలని ఎస్సీ వర్గీకరణ వ్యతిరేక పోరాట కమిటీ రాష్ట్ర కో చైర్మన్ లింగాల రవికుమార్ కోరారు. మండలంలోని పలు గ్రామాల్లో బుధవారం పర్యటించిన ఆయన.. పర్యటించిన ఆయన ముదిగొండలో ఏర్పాటుచేసిన సన్నాహక సమావేశంలో మాట్లాడారు. ప్రస్తుత జనాభా ప్రకారం ఎస్సీ రిజర్వేషన్లను 15 శాతం నుంచి 20 శాతానికి పెంచాల్సిన అవసరం ఉందని అన్నారు. ఈ సందర్భంగా సభ పోస్టర్‌ను ఆవిష్కరించారు. సంఘం నాయకులు ఉండేటి శ్రీనివాస్, సీతారాములు, కొమ్ము నర్సింహారావు తదితరులు పాల్గొన్నారు.

సీపీఐ నేత పోటు ప్రసాద్ హఠాన్మరణం

పలువురి నాయకుల సంతాపం

ఖమ్మం/ ఖమ్మం వ్యవసాయం/ కమాన్‌బజార్/ వైరాటైన్/ సత్తుపల్లి టౌన్, నవంబర్ 27 : ఖమ్మం జిల్లా సీపీఐ కార్యదర్శి పోటు ప్రసాద్ బుధవారం హఠాన్మరణం చెందారు. ఉదయం నగరంలోని గ్రౌండ్‌లో వాకింగ్ చేస్తుండగా గుండెపోటు రావడంతో అక్కడికక్కడే కుప్పకులిపోయారు. పక్కనే ఉన్న స్నేహితులు వెంటనే ఆసుపత్రికి తరలించేలోపు ఆయన మృతి చెందారు. ప్రసాద్‌కు భార్య, కుమారుడు ఉన్నారు. సీపీఐ జిల్లా కార్యదర్శి పోటు ప్రసాద్ హఠాన్మరణం అత్యంత బాధాకరమని, ఆయన మరణం తీరనిలోటని పలువురు రాజకీయ ప్రముఖులు, నాయకులు సంతాపం వ్యక్తం చేశారు. పోటు ప్రసాద్ విద్యార్థి దశ నుంచే వామపక్ష రాజకీయాల్లో చురుగ్గా ఉంటూ ప్రజా సమస్యలపై పోరాడారని కొనియాడారు. తన కుటుంబ వారసత్వాన్ని కొనసాగిస్తూ సీపీఐలో సుదీర్ఘకాలం పనిచేస్తూ ఆ పార్టీ జిల్లా కార్యదర్శి స్థాయికి ఎదిగిన గొప్ప వ్యక్తి అన్నారు. సంతాపం వ్యక్తం చేసిన వారిలో రాజ్యసభ సభ్యుడు వద్దిరాజు రవిచంద్ర, బీఆర్‌ఎస్ జిల్లా అధ్యక్షుడు, ఎమ్మెల్సీ తాతా మధుసూదన్, ఖమ్మం మాజీ ఎంపీ నామా నాగేశ్వరరావు, వర్తక సంఘం అధ్యక్ష కార్యదర్శులు చిన్ని కృష్ణారావు, మెంతుల శ్రీశైలం, మన్నెం కృష్ణయ్య, సీపీఐ సీనియర్ నేత పువ్వాడ నాగేశ్వరరావు, భాగం హేమంతరావు, మంత్రులు పొంగులేటి, తుమ్మల, కొత్తగూడెం ఎమ్మెల్యే, సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం, చంద్రావతి, డిప్యూటీ సీఎం భట్టి విక్కమార్క, ఎంపీలు రేణుకాచౌదరి, రఘురామరెడ్డి, వందేమాతరం శ్రీనివాస్, యామాల గోపాలరావు, మిట్టపల్లి రాఘవరావు, గారపాటి అశోక్ దండు ఆదినారాయణ, యోబు, రామకృష్ణ, కృష్ణవేణి, ఉన్నారు.

పోటు ప్రసాద్ (ఫైల్)

వైద్యం వికటించి బాలింత మృతి!

సత్తుపల్లిటౌన్, నవంబర్ 27 : సత్తుపల్లి పట్టణంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో వైద్యం వికటించి బాలింత మృతి చెందిన ఘటన బుధవారం చోటుచేసుకుంది. వివరాల్లోకెళ్తే.. గత శుక్రవారం వేంసూరు మండలం కల్లూరుగూడెం గ్రామానికి చెందిన గర్భిణి స్నేహలత ప్రసవం నిమిత్తం ఆసుపత్రికి వచ్చింది. పురిటినొప్పులు రావడంతో డాక్టర్ ఆపరేషన్ చేసింది. అయితే మత్తుమందు అధిక మొత్తంలో ఇవ్వడంతో బాబుకు జన్మనిచ్చి అపస్మారక స్థితికి వెళ్లిందని బంధువులు ఆరోపిస్తున్నారు. ఆసుపత్రి యాజమాన్యం సమక్షంలో బాలింతను ఖమ్మంలోని ఓ ప్రైవేటు ఆసుపత్రికి తరలించగా అక్కడ చికిత్స పొందుతూ బుధవారం మృతిచెందింది. దీంతో బంధువులు సత్తుపల్లి ఆసుపత్రి ఎదుట ఆందోళన చేసేందుకు సిద్ధమవ్వగా నష్టపరిహారం చెల్లిస్తామని చెప్పడంతో మృతదేహాన్ని స్వగ్రామానికి తరలించి అంత్యక్రియలు పూర్తిచేసినట్లు తెలిసింది. సత్తుపల్లి ప్రాంతీయ వైద్యాధికారి డాక్టర్ సీతారాంను వివరణ కోరగా విచారణ జరిపి పై అధికారులకు నివేదిక పంపుతానని చెప్పారు.

పేకాట స్థావరంపై పోలీసుల దాడి

మామిళ్లగూడెం, నవంబర్ 27 : నగరంలోని డాబాల బజార్‌లోని ఓ నివాసంలో నిర్వహిస్తున్న పేకాట స్థావరంపై ఖమ్మం మూడో పట్టణ పోలీసులు బుధవారం దాడి చేశారు. పేకాట ఆడుతున్న నలుగురు వ్యక్తులను అదుపులోకి తీసుకుని వారి నుంచి రూ.38,850 నగదు స్వాధీనం చేసుకున్నామని సీఐ రమేష్ తెలిపారు.

టిప్పర్ ఢీకొని వ్యక్తికి తీవ్రగాయాలు

మామిళ్లగూడెం, నవంబర్ 27 : టిప్పర్ ఢీకొని వ్యక్తి తీవ్రంగా గాయాలైన ఘటన ఖమ్మం నగరంలో బుధవారం చోటుచేసుకుంది. ఒకటో పట్టణ పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. ఖమ్మం చెరువుబజార్ మాణిక్యనగర్ దర్గా సమీపంలో ద్విచక్ర వాహనాన్ని వెనుకనుంచి వస్తున్న టిప్పర్ వేగంగా ఢీకొట్టింది. ఈ ఘటనలో టిప్పర్ ముందు చక్రం మీదకు ఎక్కడంతో ఖానాపురం ప్రశాంతినగర్‌కు చెందిన ప్రైవేటు ఎలక్ట్రీషియన్ చెరుకుపల్లి హనుమంతరావు తీవ్రంగా గాయపడ్డాడు. స్థానికులు క్షతగాత్రుడున్ని 108లో ఆసుపత్రికి తరలించారు. మెరుగైన వైద్యం కోసం హైదరాబాద్‌కు తరలించారు. బాధితుడి బంధువు ఉపేందర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ ఉదయ్‌కుమార్ తెలిపారు.

ప్రకటన

ఇందుమూలముగా నాక్లయింటు అయిన శ్రీరామ్ ఫైనాన్స్ లిమిటెడ్, వైరా బ్రాంచ్ వారు ఇచ్చిన బోగట్టా ప్రకారం యావన్మందికి తెలుపునది. ఈ క్రింది షెడ్యూలు చూపిన స్థిరాస్తిని రిజిస్టర్ తనఖా చేయించుకొని **మందేరకల నాగేశ్వరరావు**, S/o. **వెంకటేశ్వర్లు**, వయస్సు : 43 సం||లు, నివాసం : ఒంటిగుడిశ గ్రామం, ఏన్కూరు మండలం, నాచారం, ఖమ్మం జిల్లా గారికి ఋణం ఇచ్చుటకు నిర్ణయించుకున్నారు. కావున సదరు వ్యవహారమునకు సంబంధించి సదరు షెడ్యూల్ స్థిరాస్తిపై ఎవరికైననూ ఎటువంటి జప్తులు చార్జీలు, క్లెయిములు, తనఖాలు అగ్రిమెంట్లు, కోర్టు వివాదములు తదితర అభ్యంతరములు ఉన్నయెడల నేటి నుండి 3 రోజులలో ఈ క్రింద చూపిన చిరునామాకు వ్రాతపూర్వకముగా తెలియజేయగలరు. తదుపరి వచ్చు అభ్యంతరములకు నా క్లయింటు బాధ్యులు కారు.

షెడ్యూలు ఆస్తి : 1వ పార్టీ వారు : మందేరకల నాగేశ్వరరావు గారి వాటా విలువ రూ. 9,46,000/-లు : ఖమ్మం రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్ట్, వైరా సబ్ రిజిస్ట్రార్ వారి అధికార పరిధిలో ఖమ్మం జిల్లా పరిషత్, ఏన్కూరు మండల పరిషత్, **భద్రుతండ గ్రామ పంచాయితీ** పరిధిలో చేరిన **నాచారం గ్రామ** రెవిన్యూ రికార్డుకు చెందిన ఒంటిగుడిశ గ్రామములో గల గృహసహిత నివేశన స్థలము విస్తీర్ణం చ||గ|| 308.0లు, ఇందుకు సరియగు చ||మీటర్లు 257.51 అందుగల ఇంటి నెంబరు 4-25/2, అసెస్మెంట్ నెం.31గా గల గృహము యొక్క ఆర్.సి.సి. నిర్మాణ వైశాల్యము చ||అ|| 391.0లు మరియు ఏ.సి.సి. నిర్మాణ వైశాల్యము చ||అ|| 276.0లు. అట్టి గృహమునకు గల విద్యుత్ సర్వీసు మీటరు విద్యుత్ వగైరా ఫిట్టింగులతో గల గృహము యొక్క వార్షిక అద్దె విలువ రూ. 8,000/-లు, గృహము యొక్క వయస్సు 10 సం||లు, **డాక్యుమెంట్ నెం : 1215/2024**, గల అట్టి గృహ సహిత నివేశన స్థలమునకు హద్దులు : **తూర్పు** : గ్రామ పంచాయితీ రోడ్డు, **పడమర** : కుంజా కోటేష్ గారి గృహము, **ఉత్తరం** : మందేరకాల నాగరాజు గారి గృహము, **దక్షిణము** : హారెం కోటేష్ గారి గృహము.

జి.హరేందర్ రెడ్డి
అడ్వకేట్, ఖమ్మం. సెల్ : 9848022542రర

మూడు ఇసుక ట్రాక్టర్ల పట్టివేత

తిరుమలాయపాలెం, నవంబర్ 27: మండలంలోని కాకరవాయి వద్ద మూడు అక్రమ ఇసుక ట్రాక్టర్లను స్థానిక పోలీసులు బుధవారం పట్టుకున్నారు. మండలంలోని కాకరవాయి సమీపంలోని పాలేరు వాగు నుంచి అక్రమంగా ఇసుకను అక్రమంగా తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో ఎస్ఐ జగదీశ్ ఆధ్వర్యంలో దాడులు నిర్వహించారు. అక్రమంగా ఇసుకను తరలిస్తున్న మూడు ఇసుక ట్రాక్టర్లను పట్టుకొని పోలీస్‌స్టేషన్‌కు తరలించారు. ఆ ట్రాక్టర్లపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు పోలీసులు తెలిపారు.

సామాజిక రంగంలో సేవచేసిన వారికి సత్కారం

మామిళ్లగూడెం, నవంబర్ 27 : క్రిస్మస్ సంబురాల్లో భాగంగా సామాజిక, విద్య, వైద్యం, సాహిత్యం, కళా, క్రీడా తదితర రంగాల్లో ఉత్తమ ప్రతిభ, సేవలు అందించిన క్రైస్తవులను రాష్ట్ర ప్రభుత్వం సత్కరిస్తున్నదని జిల్లా మైనార్టీ సంక్షేమశాఖ అధికారి కస్తాల సత్యనారాయణ బుధవారం ప్రకటనలో తెలిపారు. తెలంగాణ రాష్ట్ర మైనార్టీ ఫైనాన్స్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో గల పదేళ్లుగా ఉత్తమ సేవ, ప్రతిభ కనబర్చిన 30సంవత్సరాలు పైబడిన వారినుంచి నామినేషన్లు స్వీకరిస్తున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి గల వారు నామినేషన్ల ఫారాలు జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయం, కలెక్టరేట్ భవనంలో లేదా ఆన్‌లైన్‌లో www.tscmfc.in నుంచి పొందవచ్చని సూచించారు. పూర్తిచేసిన ఫారాలను డిసెంబర్ 6 తేదీలోగా జిల్లా మైనార్టీ సంక్షేమ కార్యాలయంలో అందించాలన్నారు. వివరాలకు 08742-231768 లేదా 040-23391067 నంబర్‌లో సంప్రదించాలని కోరారు.

రేపటి నుంచి రైతు పండుగ వేడుకలు

ఖమ్మం వ్యవసాయం, నవంబర్ 27 : ప్రజాపాలన విజయోత్సవాల్లో భాగంగా ఈ నెల 28, 29, 30 తేదీల్లో మహబూబ్‌నగర్ జిల్లా కేంద్రంలో రైతుపండుగ వేడుకలను రాష్ట్ర ప్రభుత్వం నిర్వహిస్తున్నదని జిల్లా వ్యవసాయశాఖ అధికారి డీ పుల్లయ్య బుధవారం ప్రకటనలో తెలిపారు. దీనిలో భాగంగా ప్రతి మండలం నుంచి 50మంది రైతులను వ్యవసాయశాఖ ద్వారా పంపిస్తున్నట్లు పేర్కొన్నారు.

పెద్దాసుపత్రిలో డైట్ సప్లై టెండర్లకు ఆహ్వానం

ఖమ్మం సిటీ, నవంబర్ 27 : ఖమ్మం జిల్లా ప్రభుత్వ జనరల్ ఆసుపత్రిలో రెండు సంవత్సరాలపాటు ఇన్‌పేషెంట్స్, డ్యూటీ డాక్టర్స్, థెరప్టిక్ పేషెంట్స్‌కు అవసరమగు భోజన వసతి(డైట్ సప్లై) చేయుటకు టెండర్లు కోరుతున్నామని మెడికల్ సూపరింటెండెంట్ ఎల్. కిరణ్‌కుమార్ బుధవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అర్హత కలిగిన ఏజెన్సీలు టెండర్ ఫారం కోసం రూ.పది వేలు విలువైన డిమాండ్ డ్రాఫ్ట్‌ను మెడికల్ సూపరింటెండెంట్, ప్రభుత్వ జనరల్ హాస్పిటల్ ఖమ్మం పేరుతో తీసి పెద్దాసుపత్రి కార్యాలయంలో అందజేయాలన్నారు. డిసెంబర్ 6వ తేదీ నాటికి టెండర్ ఫారం పొంది, 9 వరకు సమర్పించాలన్నారు.

వయోవృద్ధులకు ప్రత్యేక సేవలు..

పెద్దాసుపత్రిలో వయో వృద్ధులకు ప్రత్యేక వైద్యసేవలు అందించబోతున్నరు. కలెక్టర్ ముజమ్మిల్‌ఖాన్ ఆదేశానుసారం ప్రతి శుక్రవారం అధిక వయస్సు కలిగిన వారికి ఓపీ సేవలు సునాయాసంగా లభించనున్నాయి. దీనికి గాను ఆసుపత్రిలోని మహిళల ఓపీ గదిని కేటాయించారు. నిర్దేశించిన రోజున హెచ్‌ఓడీలు, వైద్యులు, సిబ్బంది అందరూ విధిగా అందుబాటులో ఉండాలని మెడికల్ సూపరింటెండెంట్ ఉత్తర్వులు జారీ చేశారు.

నాణ్యమైన భోజనం అందించాలి

మధ్యాహ్న భోజనాన్ని పరిశీలిస్తున్న జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత

వేంసూరు, నవంబర్ 27: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు నాణ్యమైన భోజనం అందించాలని జిల్లా పంచాయతీ అధికారి ఆశాలత అన్నారు. బుధవారం వేంసూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, ప్రాథమిక పాఠశాలను ఆమె ఆకస్మికంగా తనిఖీ చేశారు. మధ్యాహ్న భోజనం నాసిరకంగా ఉండడంతో నిర్వాహకులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. పదోతరగతి విద్యార్థులతో మాట్లాడుతూ.. పోటీతత్వం పెంపొందించుకోవాలని, భవిష్యత్‌లో జరగబోయే పరీక్షలకు సన్నద్ధం ఎలా అవ్వాలో వివరించారు. ఆమె వెంట ఇన్‌చార్జి డీఎల్‌పీవో చంద్రశేఖర్, వేంసూరు ఇన్‌చార్జి ఎంపీడీవో నాగేశ్వరరావు, ఎంపీవో రంజిత్‌కుమార్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రేపు టాలెంట్ టెస్ట్

వైరాటౌన్, నవంబర్ 27: జిల్లా గణిత ఫోరం ఆధ్వర్యంలో ప్రభుత్వ గురుకుల పాఠశాలల విద్యార్థులకు నవంబర్ 29న నిర్వహించే గణిత ప్రతిభా పాటవా పరీక్షను విజయవంతం చేయాలని టాలెంట్ టెస్ట్ వైరా మండల కన్వీనర్ వెంకటబ్రహ్మం కోరారు. అన్ని పాఠశాలల విద్యార్థులు పాల్గొనాలని ఒక ప్రకటనలో తెలిపారు.

కల్లూరు ఎస్సైగా తోట నాగరాజు

పెనుబల్లి, నవంబర్ 27: కల్లూరు ఎస్సైగా తోట నాగరాజు బుధవారం బాధ్యతలు చేపట్టారు. పోలీస్ అధికారుల బదిలీల్లో భాగంగా కల్లూరు ఎస్సైగా షాకీర్ బదిలీ కాగా ఆయన స్థానంలో సత్తుపల్లిలో విధులు నిర్వహిస్తున్న నాగరాజు బదిలీపై వచ్చారు.

ఎస్సైగా బాధ్యతలు చేపట్టిన నాగరాజు

బిలీఫ్ వైద్యశాలకు నోటీసులు

నోటీసులు అందజేస్తున్న డీఎంహెచ్‌ఓ కళావతిబాయి

ఖమ్మం రూరల్, నవంబర్ 27: మండలంలోని ఏదులాపురం పంచాయతీ వరంగల్ క్రాస్‌రోడ్డు వద్ద నిర్మించిన బిలీఫ్ వైద్యశాలకు డీఎంహెచ్‌వో డాక్టర్ కళావతిబాయి నోటీసులు జారీ చేశారు. సదరు నిర్వాహకులు కొద్దిరోజుల క్రితమే ఈ వైద్యశాలను ప్రారంభించారు. ఈ క్రమంలో బుధవారం సాయంత్రం డీఎంహెచ్‌వో, ఇతర వైద్యారోగ్యశాఖ అధికారులు, మండల పంచాయతీ అధికారి తదితరులు ఈ వైద్యశాలకు చేరుకున్నారు. అక్కడి వైద్యశాల సిబ్బందికి నోటీసులు అందజేశారు. పూర్తిస్థాయిలో అనుమతులు వచ్చేవరకు ఈ ఆసుపత్రిని తెరవొద్దని ఆదేశించారు.

మాలమహానాడు కమిటీ ఎన్నిక

మధిర, నవంబర్ 27: మాలమహానాడు మధిర పట్టణ అధ్యక్ష కార్యదర్శులుగా బొల్లెద్దు రాజేందర్, నీలం రమేశ్ బుధవారం ఎన్నికయ్యారు. ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా డిసెంబర్ 1న హైదరాబాద్‌లో జరిగే మాలల సింహగర్జన సభ విజయవంతం కోసం రాష్ట్ర వ్యాప్తంగా మాలమహానాడు కమిటీలను నియమిస్తున్నట్లు సంఘం నాయకులు చెప్పారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. సభకు మధిర నుంచి భారీస్థాయిలో జనసమీకరణ చేస్తున్నట్లు తెలిపారు.

డేటా ఆన్‌లైన్‌ను వేగవంతంగా పూర్తి చేయాలి


ఆన్‌లైన్ ప్రక్రియను పరిశీలిస్తున్న డీఎల్‌పీవో

కారేపల్లి, నవంబర్ 27: సమగ్ర కుటుంబ ఇంటింటి సర్వే డేటా ఆన్‌లైన్ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని డీఎల్‌పీవో రాంబాబు కంప్యూటర్ ఆపరేటర్లకు సూచించారు. మండల కేంద్రంలోని ఎంపీడీవో కార్యాలయంలో జరుగుతున్న సర్వే డేటా ఆన్‌లైన్ ఎంట్రీ ప్రక్రియను బుధవారం ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా డీఎల్‌పీవో మాట్లాడుతూ.. గడువులోపు ఆన్‌లైన్‌ను పూర్తి చేయాలని తెలిపారు. ఆయన వెంట తహసీల్దార్ సంపత్‌కుమార్, ఎంపీడీవో సురేందర్, ఎంపీవో రవీంద్రప్రసాద్ పాల్గొన్నారు.

ఎఫ్‌ఎస్‌వో ఫలితాల్లో స్టేట్ ర్యాంకు

వైరాటౌన్, నవంబర్ 27: ఎఫ్‌ఎస్‌వో ఫలితాల్లో నల్లాల రతన్ ప్రసాద్‌రెడ్డి స్టేట్‌ఫస్ట్ ర్యాంకు సాధించారు. వైరాలో ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్‌గా పనిచేస్తున్న ఆతనికి ఇటీవల నిర్వహించిన ఎఫ్‌ఎస్‌వో నియామక పరీక్షలో స్టేట్ ఫస్ట్ ర్యాంక్ సాధించి చార్మినార్ ఫసోగా సెలక్ట్ అయ్యాడు. గ్రూప్1 అధికారి కావడమే తన లక్ష్యమని పేర్కొన్నారు.

మన రాష్ట్రం మన పత్రిక
నమస్తే తెలంగాణ
నమస్తే తెలంగాణ దినపత్రికలో
చందా కొరకై మరియు పత్రికా పంపిణీలో
ఏమైన సమస్యలు ఉంటే సంప్రదించగలరు
సెల్ : 9182777073



నమస్తే తెలంగాణ దినపత్రికలో అన్ని రకాల
ప్రకటనలు (అడ్వర్టైజ్‌మెంట్స్) కొరకు సంప్రదించగలరు
సెల్ : 9182777616